క్లుప్తంగా

సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



సీడీపీఓ సూర్యకుమారికి పూలమొక్క అందజేస్తున్న సూపర్‌వైజర్లు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన సీడీపీఓగా సూర్యకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఉమామహేశ్వరమ్మ నందికొట్కూరుకు బదిలీపై వెళ్లారు. ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సూర్యకుమారి పదోన్నతిపై బనగానపల్లెకు వచ్చారు.ఆమెకు సూపర్‌వైజర్లు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. సిబ్బంది సహకారంతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, లక్ష్మీశైలజ, సుగుణమ్మ, పద్మావతి, సుంకమ్మ, శివమ్మ, పావని ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. గృహ, విద్యుత్, ఉపాధిహామీ, వైద్య, విద్య, సాగునీరు తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని సూచించారు.

సీపీఐ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

కొలిమిగుండ్ల: డోన్‌లో ఈనెల 30 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే సీపీఐ మహాసభలకు కార్మికులు, కర్షకులు తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి సూర్యనారాయణ, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మహాసభలకు సంబంధించి కొలిమిగుండ్లలో కరపత్రాలు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు కంబగిరిస్వామి, దేవా, నాగరాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం ఆలయానికి రూ.25వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయాభివృద్ధికి గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామ వాస్తవ్యులు ఎస్.శివరాముడు స్వామి, లక్ష్మీదేవి దంపతులు శుక్రవారం రూ.25,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ సంప్రదాయ ప్రకారం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



మంజులత

ప్యాపిలి: జలదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఉన్నిగొర్ల మంజులత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ శుక్రవారం తెలిపారు. జలదుర్గం గ్రామానికి చెందిన రామాంజనేయులు కుమార్తె మంజులత పదో తరగతిలో 568 మార్కులు సాధించినట్లు చెప్పారు. శుక్రవారం వెలువడిన మూడో విడత ఫలితాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని అభినందించారు.

ట్రంకు పెట్టెల పంపిణీ



ట్రంకు పెట్టెలు అందుకున్న విద్యార్థులు

ప్యాపిలి: స్థానిక బాలుర బీసీ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు ప్యాపిలికి చెందిన మోహన్ బాబు శుక్రవారం ట్రంకు పెట్టెలు పంపిణీ చేశారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు, హాస్టల్ వార్డెన్ వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొత్తం 75 మంది విద్యార్థులకు 75 ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. తమ తల్లిదండ్రులు గోవిందప్ప, నరసమ్మ జ్ఞాపకార్థం హాస్టల్ విద్యార్థులకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశామని దాత మోహన్ బాబు తెలిపారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. దాతను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్ తదితరులు అభినందించారు.

వాసవీమాతకు విశేష పూజలు

డోన్ టౌన్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక అమ్మవారిశాలలో వాసవీ మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గాజులు సమర్పించారు. కుంకుమార్చన చేశారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- కొలిమిగుండ్ల ఇండస్ట్రియల్ పార్కు రోడ్లు అధ్వానం
- సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంతో భారీ వాహనాల రాకపోకలు
- రైతుల పొలాలకు వెళ్లేందుకు అవస్థలు



వాహనాల రవాణతో దెబ్బతిన్న రోడ్డు

కొలిమిగుండ్ల: ఫ్యాక్టరీలు ఏర్పాటుచేసే ముందు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉన్నా.. కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట సమీపంలో నిర్మాణంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆ నియమాన్ని పట్టించుకోవడం లేదు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ లోడుతో వస్తున్న ట్రక్కులు ఈ ప్రాంత రహదారులను నాశనం చేస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీకి చేరుకునేందుకు కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కు రోడ్లను వాహనాలు అధిక సంఖ్యలో వినియోగిస్తున్నాయి. ఇటీవల వర్షాల కారణంగా రహదారులపై గుంతలు ఏర్పడి, వాటిలో బురద నిలవడంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. మొదట ఒక రోడ్డులో వాహనాల రాకపోకలు సాగుతుండేవి. గుంతలు పడి వాహనాలు ఇరుక్కుపోవడంతో మరొక రోడ్డుపై వెళుతున్నాయి. ఏపీఐఐసీ అనుమతితో తాత్కాలికంగా ఇండస్ట్రియల్ పార్కులో వాహన రాకపోకలు సాగిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా అనంతపురం-అమరావతి హైవేకు సరిహద్దులో ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు ఆ మార్గాన్ని వినియోగిస్తున్నాయి. ఈహైవే చెంతనే పార్కు రోడ్డు ఉండడంతో వాటి మీదుగా ఫ్యాక్టరీలోకి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఫ్యాక్టరీ ఎంట్రన్స్ వద్ద సెక్యూరిటీ లేకపోవడం కూడా రాకపోకల్ని మరింత జటిలతరం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఇటిక్యాల సమీపం నుంచి ప్లాంట్ వరకు ప్రత్యేక రహదారి నిర్మించేందుకు భూమి కేటాయించినా, ఇప్పటివరకు ఆ రహదారి నిర్మాణం కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ పనులకంటే ముందుగా రహదారి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



అధిక లోడుతో వెళుతున్న వాహనాలు

అంతా బురదమయం

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమ కింది కొట్టాల గ్రామ రహదారి దుస్థితి వాహనదారులకు నానా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అడుగు అడుగున గోతులు ఏర్పడ్డాయి. బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు జారి కిందపడిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామ రహదారి నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఫిబ్రవరిలో రూ.3.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే, 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో మేఘా ఇంజినీరింగ్ కంపెనీ పనులు ప్రారంభించింది. రహదారి అంతా లోయల్లో ఉండడంతో ముందుగా రక్షణ గోడలు నిర్మించి, చదునుగా చేసి కంకర వేశారు. అయితే, ఎన్నికల రావడంతో పనులు ఆగిపోయాయి. ఏడాది నుంచి ఎలాంటి పనులు జరగకపోవడంతో కంకర తేలింది. రహదారి మళ్లీ గుంతలుగా మారిపోయింది. వర్షాల సమయంలో ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదాలు రోజూ చోటుచేసుకుంటున్నాయి. ఈ గ్రామానికి సమీపంలో ప్రసిద్ధి గాంచిన బిల్వ స్వర్గం గుహలు ఉండడంతో పర్యాటకులు వస్తుంటారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం ద్వారా బనగానపల్లె మండలంలోని రామకృష్ణాపురం, పలుకూరు వంటి గ్రామాలకు కూడా వెళ్లవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిలిచిపోయిన రహదారి పనులు తిరిగి ప్రారంభించాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.





బేతంచెర్ల నుంచి కనుమ కింది కొట్టాల గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి, బురదమయంగా మారిన రోడ్డు

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



డోన్ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు, కిడ్నాప్‌లు, హత్యలు పెరిగిపోతున్నాయని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరామకృష్ణ, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్‌నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఐఏఎల్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు డోన్ కోర్టు ఎదుట శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై అఘాయిత్యాలను అరికట్టేందుకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ఇళ్లు లేని న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, వృత్తిలోకి కొత్తగా వచ్చిన న్యాయవాదులకు 'లా నేస్తం' పథకాన్ని పునరుద్ధరించి నెలకు రూ.10,000 ఆర్థిక సహాయం ఇవ్వాలన్నారు. బార్ కౌన్సిల్ వెల్ఫేర్ ఫండ్‌ను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంటును రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్ గౌడ్, రంగారెడ్డి, శ్రీనివాసులు శెట్టి, శ్రీరాములు, రవికుమార్, మద్దిలేటి స్వామి, కృష్ణమూర్తి, పులి దామోదర్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని.. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులకు తెలియజేసి వారిని ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు

- 52 దూడల నుంచి రక్తనమూనాల సేకరణ



ఉంగరానిగుండ్లలో పశువుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

డోన్: నల్ల, తెల్లజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల, ప్యాపిలి మండలంలోని చంద్రపల్లె గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిర్ధారణ కోసం 6 నెలల నుంచి 18 నెలల వయస్సున్న మొత్తం 52 దూడల నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించడానికి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వ్యాధి ప్రబలక ముందే నివారణ చర్యలు తీసుకోవడం వల్ల పశుపోషకులకు ఆర్థిక నష్టం నుంచి రక్షణ ఉంటుందని సూచించారు. గతంలో గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నుంచి కూడా నమూనాలు సేకరిస్తామని తెలిపారు. కర్నూలు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకుడు డాక్టర్ రామచంద్ర, డాక్టర్ దినకర్, కొత్తపల్లె కేంద్రం వైద్యాధికారి పద్మావతి, టెక్నీషియన్ సుజాత, ఏహెచ్ఏలు రామాంజనేయులు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతోనే బంగారు భవిష్యత్తు



అవగాహన సదస్సులో సీఐ, ఎస్ఐలు

బనగానపల్లె: విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించాలన్నారు. ఈవ్ టీజింగ్, నేరాలు, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు సక్రమ మార్గంలో నడిచేలా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండయ్య, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత



మొక్కల చుట్టూ రక్షణ ఏర్పాటు

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని ఎంపీపీ ఆదర్శ పాఠశాల హెడ్‌మాస్టర్ జి. ఓబుళరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో దాతల సహకారంతో ఎంపీపీ ఆదర్శ పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటి, వాటి చుట్టూ గ్రిల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు. చెట్లు వాతావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుతాయని, అందుకే వాటి సంరక్షణపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఖాదర్‌బాషా, జాస్మిన్ సుల్తానా, ఎస్ఎంసీ చైర్మన్ ఖాసీం, దాతలు మద్దిలేటిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు శ్రావణ మాస పూజలు



గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకుడు నాగేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా తిరుచ్చి మహోత్సవం



పల్లకీలో మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి మహోత్సవాన్ని నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి దితరులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో వాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ కనుల పండువగా ఊరేగింపు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెంకటాపురం ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శని, ఆదివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర, రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

- డోన్ సబ్‌జైల్‌లో ఖైదీలకు టీబీ నిర్ధారణ పరీక్షలు



సబ్‌జైల్‌లో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

డోన్: క్షయవ్యాధి రహిత సమాజమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌లో ఖైదీలకు టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాల కన్నా ఎక్కువ దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవాలని సూచించారు. మద్యం, ధూమపానం చేసే వ్యక్తులు, హెచ్ఐవీ, మధుమేహం ఉన్నవారిలో టీబీ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పోషకాహార లోపం కూడా ప్రధాన కారణంగా పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి నిక్షయ్ పోషణ యోజన కింద ప్రతి నెలా రూ.1000 బ్యాంకు ఖాతాలో జమవుతుందన్నారు. అంతేకాకుండా ఆరు నెలలపాటు వారిని దత్తత తీసుకుని పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారి కరీముల్లా, పర్యవేక్షకుడు ఉపేంద్ర, సుధాకర్, హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మధుబాబు, ఏఎన్ఎం సుమలత పాల్గొన్నారు.

ప్రారంభించిన వారం రోజులకే మూత!

- డోన్‌లో మూతపడిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు



పోలీసుస్టేషన్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్



ఆధునిక కూరగాయల మార్కెట్ వద్ద మూతపడిన ప్లాంట్

డోన్: పట్టణంలో ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభమైన వారం రోజుల్లోనే మూతపడ్డాయి. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో, స్థానిక కెమికల్ ఫ్యాక్టరీ ఆర్థిక సహకారంతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినా నిర్వహణను పట్టించుకోకపోవడంతో అది పనిచేయకుండా మూతపడిపోయింది. తలకు మించిన భారంగా మారడంతో నిర్వహించలేకపోతున్నామని పోలీసులు అధికారులు చెబుతున్నారు. అదే తరహాలో, కూరగాయల మార్కెట్ పక్కన ఆర్గానిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మల చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించిన మరో మినరల్ వాటర్ ప్లాంట్ మూడు రోజులకే మూతపడింది. ఈ రెండు ప్రాంతాల్లో రోజూ వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా, తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి అవసరాలున్న చోట్ల ప్లాంట్ల నిర్వహణను రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్, ఇన్నర్వీల్ క్లబ్ లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి ప్రజలకు మళ్లీ అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

కొలిమిగుండ్ల: పెద్దవెంతుర్లలో ఎస్సీలకు చెందిన ఇళ్లు కూల్చివేసిన ఘటనలో వైఎస్సార్ జిల్లా దన్నవాడకు చెందిన కర్నాటి పుల్లారెడ్డిపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. 2000లో 218 సర్వే నంబర్‌లో ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పున 25 మందికి అప్పటి రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ స్థలాల్లో కొంత మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా మరి కొందరు అసంపూర్తిగా ఉంచారు. ఇళ్ల స్థలాల పక్కనే పుల్లారెడ్డికి చెందిన పొలం ఉండడంతో దౌర్జన్యంగా జేసీబీతో పది ఇళ్లు పూర్తిగా నేలమట్టం చేశాడు. ఈవిషయంపై బాధితులు ప్రశ్నించడంతో కులం పేరుతో దూషించాడు. జింగిలి బాల నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లారెడ్డిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వేళాయె

- రేపటి నుంచి 30 వరకు మహాసంప్రోక్షణ మహోత్సవాలు
- రామ్‌కో ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో జీర్ణోద్ధరణ



జీర్ణోద్ధరణ చేసిన గర్భగుడి, గాలిగోపురం



సిద్ధమవుతున్న కోనేరు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. సుమారు నాలుగేళ్ల నుంచి స్వామివారి దర్శనం లేక భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. ఎట్టకేలకే స్వామిని దర్శించుకునే సమయం ఆసన్నం కావడంతో భక్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. శ్రీకృష్ణదేవరాయల ఏలుబడిలో కొలిమిగుండ్ల కొండపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శిల్పకళతో నిర్మించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేపట్టాలని అప్పటి ప్రజాప్రతినిధులు రామ్‌కో సిమెంట్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.7 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మాణానికి ముందుకొచ్చింది. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. మొదట్లో అనివార్యకారణాల వల్ల పనుల్లో జాప్యం చోటు చేసుకుంది.

పూర్వవైభవం

శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి ఆలయానికి పూర్వవైభవం సంతరించుకుంది. గర్భగుడి, మండపం పైభాగాన్ని పూర్తిగా తొలగించి గ్రానైట్ రాళ్లతో పటిష్టంగా నిర్మించారు. గర్భగుడి లోపల గ్రానైట్‌తో ఫ్లోరింగ్ చేశారు. గతంలో ఉన్న మూడు అంతస్తుల గాలిగోపురం స్థానంలో ఐదు అంతస్తులు నిర్మించారు. ఆలయ ఆవరణాన్ని విశాలంగా తీర్చిదిద్దారు. ప్రాకారాన్ని దిగువ నుంచి కట్టుదిట్టంగా నిర్మించారు. చిన్న కోనేరును పూర్తిగా పూడ్చివేసి పెద్ద కోనేరును పటిష్టంగా చేస్తున్నారు. మెట్ల మార్గం నుంచి ఆలయ ఆవరణం, గాలిగోపురం, గర్భగుడికి ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు జిగేల్ మంటున్నాయి.

కార్యక్రమాలు ఇలా

ఈనెల 27 నుంచి 30 వరకు లక్ష్మీనరసింహస్వామి మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. టీటీడీ నుంచి వేదపండితులు ఆగమ శాస్త్ర ప్రకారం నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 27న నుతన విగ్రహాల గ్రామోత్సవం, విష్ణుసహస్ర పారాయణం, అంకురార్పణ, 28న ప్రబంధ సేవా కాలం, పుణ్యాహవాచనం, ద్వారతోరణ ధ్వజ, 29న మూలమంత్ర జపం, నిత్య పూర్ణాహుతి, జలాధివాసం, 30న యాగశాల ప్రవేశం, ధ్వజ కుంబారాధనం, మహా పూర్ణాహుతి, గరుడ, ధ్వజస్తంభ ప్రతిష్ట, లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణం నిర్వహించనున్నారు. మహోత్సవాలకు రామ్‌కో సిమెంట్ చైర్మన్ రామచంద్రరాజు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.